బీజేపీ నూతన కార్యవర్గం ఏర్పాటు



మేడ్చల్: మున్సిపాలిటీ బీజేపీ కార్యవర్గాన్ని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిలుగా జాకట ప్రేమ్‌దాస్, వంశీ విజయ్, ఉపాధ్యక్షులుగా సర్వేశ్వర్‌రెడ్డి, మైసరి రాజు, మల్లేష్‌యాదవ్, కోశాధికారిగా ఉపేందర్ గుప్తా, కార్యదర్శులుగా విష్ణుగౌడ్, సురేందర్ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కార్యవర్గసభ్యులుగా రాంచంద్రారెడ్డి, రాజు, శోభారెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పట్టణ నాయకులు ఘనంగా సన్మానించారు.

కాంట్రాక్టర్స్ నూతన అసోయేషన్



కీసర: దమ్మాయిగూడ, నాగారం మున్సిపల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు సింగోజి నర్సింహాచారి ఆధ్వర్యంలో సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, కందాడి అంజిరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వజ్రేష్ యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. కీసర మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ రమేష్‌గుప్తా, కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

శామీర్‌పేట్: మేడ్చల్ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం ఉంటుంది. ఉదయం 10 గంటలకు తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ వేద ఫంక్షన్‌హాల్‌లో పంపిణీ చేయనున్నట్లు శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

బీజేపీలోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలరాజుయాదవ్

కీసర: బీజేపీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని కీసర మండల బీజేపీ అధ్యక్షులు కోల బాలరాజుయాదవ్ అన్నారు. కీసర దయారకు చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులు సోమవారం బాలరాజుయాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కొండల్‌రెడ్డి, శివరామకృష్ణ, శివకుమార్, సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డిలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, అశోక్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు నల్ల వెంకట్‌రెడ్డి, నాగరాజు, పాపయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు ఉచిత విద్య !

శామీర్‌పేట్: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌గా విజ్ఞాన భారతీయ హైస్కూల్ ఎంపికైందని స్కూల్ కరెస్పాండెంట్ హనుమంత్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా 2025–26 విద్యా సంవత్సరానికి సుమారు 25 మంది ఎస్సీ విద్యార్థినీవిద్యార్థులకు 1వతరగతిలో చేరే వారికి ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఉచితంగా విద్యను అందజేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కులం, ఆదాయ ధ్రువీకరణపత్రంతో స్కూల్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



పోచారం: డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎస్టీఎఫ్‌బీ బృందం అదుపులోకి తీసుకుంది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కాప్రాలోని పద్మశాలి టౌన్‌షిప్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్టీఎఫ్‌బీ బృందం దాడులు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న కారును స్వాధీనం చేసుకుని తనిఖీలు చేయగా.. 3.30 గ్రాముల ఎండీఎంఏ, 12.34 గ్రాముల డ్రగ్ బయటపడింది. కాగా.. కారులో ఉన్న యోగేష్(35)ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త కలెక్టర్‌కు వినతుల వెల్లువ!

ప్రజావాణిలో 86 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మనుచౌదరిపై కొండంత ఆశతో ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు, బస్తీలు, పురపాలికల నుంచి తరలివచ్చిన మహిళలు, ప్రజలు తాము ఎదుర్కొంటున్న బాధలను రాతపూర్వకంగా కలెక్టర్ మనుచౌదరికి అందజేశారు. గతంలో పరిష్కారం కాని సమస్యలు కొత్త కలెక్టర్ పరిష్కరించగలరన్న ధీమాతో వినతులు సమర్పించడంతో పాటు తమ కష్టాలను చెప్పుకున్నారు. నిరుపేద ప్రజలు వ్యక్తిగత సమస్యలతో పాటు సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రజావాణిలో వివిధ సంఘాల ప్రజలు మొత్తంగా 86 ఫిర్యాదులను రాతపూర్వకంగా కలెక్టర్‌కు అందజేశారు.

పురపాలక సంఘాల నుంచే అధికం

జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు ,జీహెచ్ఎంసీ పరిధిలోని 8 మున్సిపల్ సర్కిళ్లు ఉండగా.. ఇక్కడ నుంచే అధికంగా 27 ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి. ల్యాండ్ సర్వే విభాగానికి 6, జిల్లా వైద్యారోగ్యశాఖకు 3, లోకల్ బాడీస్‌కు 7 ఫిర్యాదులు కలెక్టర్‌కు అందాయి. మల్కాజిగిరి, కీసర ఆర్డీఓ పరిధికి 5 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టరేట్ విభాగంలోని వివిధ సెక్షన్లలో పెండింగ్ పనులపై ప్రజావాణిలో 8 ఫిర్యాదులను అందజేశారు

సంక్షేమ పథకాల కోసం..

వివిధ ప్రాంతాలు, బస్తీల నుంచి వచ్చిన పలువురు ప్రజలు, మహిళలు సంక్షేమ పథకాలకు సంబంధించి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై కూడా వినతులు సమర్పించారు. అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మనుచౌదరి ప్రజావాణి కార్యక్రమానికి తప్పక హాజరవుతారన్న సమాచారం ఉండటంతో జిల్లా ఉన్నతాధికారుల హాజరు శాతం గతం కంటే గణనీయంగా పెరిగింది.

నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి : కలెక్టర్ మనుచౌదరి

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ, ప్రయాసలకు ఓర్చుకుని తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులుగా తమపై ఉందని కలెక్టర్ సూచించారు. తిరస్కరించే దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత కారణాలతో ఆర్జీదారులకు తెలపాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. వినతులపై చేపట్టిన చర్యల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో భద్రంగా పొందుపరచాలని సూచించారు.

రైతు వేదిక నుంచి వీడియో కాన్ఫరెన్స్



సమావేశానికి హాజరైన కలెక్టర్ మనుచౌదరి తదితరులు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి రైతు వేదిక నుంచి సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తిలకించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు, 5 మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో చేపట్టిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు రైతులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి'



జవహర్‌నగర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాలు

జవహర్‌నగర్: 'ఆపరేషన్ కగార్'పై ఈనెల 17న ధర్నాచౌక్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ నాయకురాలు అనురాధ పిలుపునిచ్చారు. సోమవారం జవహర్‌నగర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మావోయిస్టు రహిత భారత్‌గా మారుస్తామని ప్రధాని ప్రకటించడం సిగ్గుచేటని, సమాజంలో దోపిడి, అసమానతలు ఉన్నంత కాలం మావోయిజం ఉంటుందన్నారు. '17 నెలల్లోనే ఆదివాసీలు, మావోయిస్టులు మొత్తం 550 మందిని పొట్టన పెట్టుకోవడం' దుర్మార్గమన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు షేక్ షావలి, అల్లూరి సావిత్రి, దశరథ, వెంకటాచారి, స్వరూప, మల్లేష్, ఆంజనేయులు, పరమేష్, రవిచారి, వెంకటాచారి, యాదయ్య, సునీత, కుర్మయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి



గ్రేటర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అల్వాల్ కొత్త చెరువు, సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌పై తెలంగాణకు చెందిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. క్యాంప్ ఆఫీస్‌కు కార్యాలయం కేటాయించాలని, మచ్చబొల్లారం డివిజన్ రైల్వేబజార్ రైల్వేస్టేషన్ సమీపంలో టన్నెల్ విస్తరణకు నిధులు కేటాయించాలని కోరానన్నారు. వివిధ డివిజన్ల వార్డు ఆఫీస్‌లు ప్రజలు ఉపయోగించుకోవడానికి, అల్వాల్‌లో ఫైర్‌స్టేషన్, మల్కాజిగిరి ఆర్‌కేనగర్‌లో సబ్‌స్టేషన్, బండచెరువు నుంచి వచ్చే వరదనీరు జెట్టీసీ క్రాస్‌రోడ్స్ మీదుగా లాలాపేటకు తరలించడానికి నిర్మాణం చేపట్టాలని కోరానన్నారు. దీనిపై గ్రేటర్ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.


ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ ప్రతినిధులు

మౌలాలి: మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆపరేషన్‌కగార్‌కు వ్యతిరేకంగా ఈనెల 17న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ.. వినాయక్‌నగర్ సీపీఐ కార్యాలయంలో సోమవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీపీఐ మహిళా సమైక్య ప్రతినిధి రొయ్యల గిరిజాకృష్ణమూర్తి, నాయకులు ప్రభాకర్, యాదగిరి, అజీజ్, వెంకటరమణ, సయ్యద్, యూసఫ్, భూమయ్య, కమలమ్మలు పాల్గొన్నారు.

'ప్రధాని హయాంలో దేశం సుసంపన్నం'



కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్‌గౌడ్

అల్వాల్: ప్రధాని మోదీ పాలనలోనే దేశం సుసంపన్నమైందని, రైతులను రాజుగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రారంభించిన 11 ఏళ్ల వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమాన్ని సోమవారం మచ్చబొల్లారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 ఏళ్ల సేవ, సుశాసన,గరీబ్ కల్యాణ్ యాత్ర భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమం ఉద్దేశమన్నారు. నియోజకవర్గ కో–కన్వీనర్ మల్లిఖార్జున్‌గౌడ్, దండుగుల వెంకటేష్, అజయ్‌రెడ్డి, పద్మిని, ప్రసన్న, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈఓ



సాక్షి,సిటీబ్యూరో : హైదరాబాద్ నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరిచందన దాసరిని జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సోమవారం ప్రజావాణిలో పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు రేయిన్‌కోట్‌ల అందజేత



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లిలోని కృషి హోమ్ అనాథాశ్రమంలో విద్యార్థులకు ఎమ్మెల్యే మల్లారెడ్డి రెయిన్‌కోట్‌లను అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు రెయిన్ కోట్‌లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు హేమంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పెంటయ్య, పీఏసీఎస్ చైర్మన్ రణదీప్‌రెడ్డి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

మేడ్చల్‌రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన ఉద్యోగి కుటుంబానికి జీవీకేఈఎంఆర్ఐ సంస్థ అండగా నిలిచింది. జీవీకేఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలో 104 ప్రాజెక్ట్‌లో హైదరాబాద్ జిల్లా హెల్త్ అడ్వైజరీగా విధులు నిర్వహించే శైలజ మోహన్ గత ఏప్రిల్ నెలలో అనారోగ్య కారణాలతో మృతి చెందింది. ఈ మేరకు సోమవారం సంస్థ స్టేట్ హెడ్ సుధాకర్ గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కార్యాలయంలో ఆమె కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. స్టేట్ హెచ్ఆర్ హెడ్ కిరణ్ కిశోర్ తదితరులున్నారు.

'మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలి'

ఐద్వా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సృజన

మేడిపల్లి : మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బెల్టుషాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.సృజన ఎక్సైజ్ అధికారులు, మేడిపల్లి పోలీసులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెల్టు షాపుల కారణంగా అనేక కాలనీలల్లో గొడవలు, పలు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కాలనీల్లో మద్యం లభించడంతో పలు కుటుంబాలు చితికి పోతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు బెల్టు షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీ ఈటల పర్యటన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం, రావల్‌కోల్ తండా, సైదనిగడ్డ తండాల్లో పర్యటించారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆయన పర్యటించి విద్యార్థులతో ముచ్చటించారు. భోజన నాణ్యత, వసతుల కల్పన వంటి విషయాలను పరిశీలించారు. తండాల పరిస్థితి గోరంగా ఉందని, రోడ్ల సౌకర్యం లేదన్నారు. వీధిదీపాల సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగు పంటపొలాల్లోకి వెళ్తుందన్నారు. అన్ని సమస్యలను అధ్యయనం చేసి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ నేతలు నందారెడ్డి, విక్రమ్‌రెడ్డి, జగన్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, పోచయ్య, మల్లికార్జున్ ముదిరాజ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు !



వెంకటేశ్వర్లు, ప్రజావాణి అధికారి

పోచారం: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. ఒక్క ఫిర్యాదు రాకపోవడం గమనార్హం. ఇంతకు ముందు జరిగిన ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను మున్సిపల్ అధికారులు పరిష్కరించకపోవడంతో ఈ వారం ఫిర్యాదుదారులు కనిపించలేదు. ప్రజావాణి నిర్వహణ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత వారం నిర్వహించిన ప్రజావాణిలో ఓ వెంచర్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు వచ్చినట్లు చెప్పారు. ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు కమిషనర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులకు అందజేస్తున్నట్లు వివరించారు.

ఇష్టానుసారంగా చెట్ల తొలగింపు !

చర్యలు తీసుకోవాలంటున్న పర్యావరణ ప్రేమికులు



జేసీబీతో తొలగించిన వేపచెట్టు

ఘట్‌కేసర్: ప్రభుత్వం కోట్ల రూపాయలతో మొక్కలను పెంచుతుంటే మరో వైపు కొందరు చెట్లను సమూలంగా నరికేస్తూ.. పచ్చదనాన్ని కనుమరుగు చేస్తున్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ గోల్డెన్ ఎన్‌క్లేవ్‌లో ఓ బిల్డర్ ఇళ్లను నిర్మిస్తున్నారు. కాగా.. వెంచర్‌లో నిర్మిస్తున్న ఇళ్ల ప్రదేశంలో పెద్ద వేపచెట్లను అనుమతి లేకుండా నరికివేశారు. ఇలాగే వెంచర్‌లోని చెట్లను తొలగిస్తే కాలనీలో పూర్తిగా పచ్చదనం తూడుచుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులు స్పందించి అనుమతి లేకుండా చెట్లు నరికివేతపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మహిళను ఈడ్చుకెళ్తున్న పోలీస్ సిబ్బంది

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలను కాప్రా మండల తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో భారీ పోలీసుల బందోబస్తుతో కూల్చివేశారు. గిరిప్రసాద్‌నగర్‌లో ఓ ఇంటిని కూల్చివేస్తుండగా.. ఇంటి యజమాని లక్ష్మిని ఈడ్చుకుని తీసుకెళ్లి ఆమె ఇంటిని కూల్చివేశారని బాధితులు వాపోయారు. ఎన్నో ఏళ్లనాటి కాలనీలో ఇళ్లను కూల్చివేయడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు సాయి, రమేష్, పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు తగిన చర్యలు



ఎస్ఈ మాధవరెడ్డితో నాచారం కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో దోమల సమస్యను పరిష్కరించాలని ఎల్బీనగర్ జోన్ ఎంటమాలజీ ఎస్ఈ మాధవరెడ్డిని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కోరారు. సోమవారం నాచారం కార్పొరేటర్‌తో ఎస్ఈ మర్యాదపూర్వకంగా కలిశారు. నాచారం పటేల్‌కుంట చెరువులోని గుర్రపుడెక్కతో దోమల సమస్య పెరిగిపోయిందని ఎస్ఈతో పేర్కొన్నారు. చెరువులోని గుర్రపుడెక్కను తొలగించాలన్నారు. ఎఫ్‌టీసీ యంత్రం సాయంతో చెరువులోని గుర్రపు డెక్కను తొలగించాలని అడిషనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని ఎఫ్‌టీసీ యంత్రాన్ని పంపిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎంటమాలజీ ఏఈ రమేష్, సూపర్‌వైజర్ నరసింహ, తదితరులున్నారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: శానిటేషన్ సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పని చేసి డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం చర్లపల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన శానిటేషన్ డ్రైవ్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత శానిటేషన్ సిబ్బందిపై ఉందన్నారు. ఆ దిశగా కార్యచరణ చేసి డివిజన్‌లో శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాప్రా సర్కిల్ మెడికల్ ఆఫీసర్ మధుసూదన్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, యూజీడీ సూపర్‌వైజర్ నరేష్, రాంకీ ప్రతినిధులు నవీన్‌రెడ్డి, అనిల్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుపడ్డ వ్యక్తి రిమాండ్

మేడిపల్లి: నిషేధిత గంజాయితో పట్టుపడ్డ ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు పెట్రోలింగ్ చేసుండగా కోల్‌కత్తాకు చెందిన మహమ్మద్ అదీల్ (36) హనుమాన్ నగర్ కాలనీలో అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోనికి తీసుకుని విచారించగా 30 గ్రాముల గంజాయి ప్యాకెట్ లభించింది. స్వాధీనం చేసుకొని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు ఈ మేరకు రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బాలికల హాస్టల్ భవనం మార్చాలని ధర్నా



గిరిజన బాలికల వసతి గృహం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లో ఉన్న గిరిజన బాలికల వసతి గృహం భవనం కనీస సౌకర్యాలు లేవని, అన్ని సౌకర్యాలు ఉన్న భవనంలోకి హాస్టల్‌ను మార్చాలని సోమవారం హాస్టల్ ఎదుట జాతీయ బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సేవా సంఘం కోశాధికారి బట్టు వెంకన్న మాట్లాడుతూ.. నగరంలోని వివిధ పబ్లిక్ కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న గిరిజన బాలికల కోసం ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ కాంట్రాక్టర్ల ద్వారా వసతి గృహాలు నిర్వహిస్తుందని అన్నారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కనీస సౌకర్యాలు లేని పురాతన భవనంలో బాలికల వసతి గృహం నిర్వహిస్తున్నారని, ఈ వసతిగృహంలో బాత్‌రూమ్ ఇతర గదుల్లో నీళ్ల సదుపాయం లేకపోవడం, విద్యార్థులకు నిబంధనల ప్రకారం ప్రతిరోజు ట్యూషన్ చెప్పాల్సిన ట్యూషన్ చెప్పకపోవడం, అధికారులు బాలికల వసతి గృహం భవనానికి మార్చాలని లేదంటే ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు శంకర్‌నాయక్, నందు, చందులాల్, భూక్య వెంకన్న రాజు, హత్యానాయక్, లక్ష్మయ్య, స్వప్న, పుష్పలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.